# "అందని లేఖ"

చాలారోజులకు మళ్ళా రాస్తున్నాను, అన్ని ఉత్తరాలలాగే ఇదీ నీకు అందదేమో? అయినా ఇవ్వాళ రాయాలన్న తపన మళ్లా నాలో రేగుతోంది.

నీవు జవాబు రాయవు, ఊరూ పేరూ లేని నా ఉత్తరాలు వెనక్కు తిరిగిరావు. ఇవి నీకు అందుతాయా? మధ్యలో నిన్ను చుట్టుకున్న మిత్రులకు దొరికి తాత్కాలికంగా వినోదాన్ని కలిగిస్తాయా? నిర్లక్ష్యంగా ఒక వాక్యం చదివి నీవు విసుగులో దూరంగా విసిరిపారేస్తే గాలిలో చెదరిపోతాయా? ఇది నాకు తెలియదు. ఆశలేదు. అయినా రాస్తాను, ఊరికే పరిహాసాలపాలవుతాను.

ఎన్ని సంవత్సరాలో దాటిపోయినాయి, నీవు రాయక. నేనూ రాయక! అయినా మనసు మారలేదు. ఎదురు చూస్తూనేవుంది. మధ్యాహ్నం మగతగా కన్నుమూస్తాను. అప్పుడే పోస్టువాడు వస్తాడు. ఉత్తరాలు ఉంటే గుమ్మం దగ్గర గూటిలో ఉంచుతాడు. మెలకువరాగానే ఆత్రంగా గూటికేసి చూస్తాను. గూడు ఎప్పుడూ ఖాళీయే. చూడడం మాత్రం మానలేదు.

ఎన్నిసార్లు రాశాను! రాసినదే మళ్లామళ్లా రాస్తున్నానేమో! అయినా మళ్ళా చెబుతాను, అంతా! ఆఖరుసారి! ఈసారి ఇది నీకు అందుతుందా? ఏమో!

గతజన్మలో నేను నీకు స్నేహితురాలిని. ఎన్నో సంవత్సరాల వెనక, ఎన్నో అనుభవాల అడుగున నలిగిన ఈ స్నేహం నీకు స్ఫురణకు రాదు. నేను మరచిపోలేదు. నీవు నన్ను వదలివెళ్ళిన తరువాత నేను ఎదగలేదు. గడచిపోతున్న కాలం నన్ను కదల్చలేదు.

నా పేరు సురస. అది నీకు తెలియదు. అప్పుడు అందరూ నన్ను "పాప" అనేవారు. అయినా అదీ నీకు గుర్తుఉండదు. నీవు ఎప్పుడూ నన్ను ఆ పేరుతో పిలవలేదు. ఆ పసితనంలో మనం కలిసి ఆడుకున్నప్పుడు, నీవు నన్ను ఏమని పిలిచేవాడివో! ఇప్పుడు నాకు స్ఫురణకు రావటం లేదు. బహుశా ఎన్నడూ ఏ పేరుతోనూ నీవు నన్ను పిలవనే లేదా?

అదే నిజమేమో?

నీ పేరు కిరణమాలికదా! అయినా నిన్ను నేను దాదా అని పిలిచేదాన్ని అలా ఎందుకు అనేదాన్నో తెలియదు. నీవు లేకపోయినా మనస్సు మాటిమాటికి బెంగతో "దాదా, దాదా" అని పలవరిస్తూనే ఉంది. అందుకే అది జ్ఞాపకం ఉంది. ఇంత తపనగాపిలిచినా అది నీకు వినబడదు. ఎందుకో! మనసు లోలోపల శిథిలమై పరితపిస్తుంది. మరొక మనస్సును మార్చలేదు.

నిజానికి నీకు దూరంగా నేను క్షణమైనా లేను. ఇది నీకు తెలియదు. రాగమాలిక ఆలపించి ఆలపించి నీవు మైమరచిన క్షణంలో, విలాసంగా ప్రియురాండ్రతో పరిహాసమాడిన సమయంలో, ఉదయపువేళ నిదురలేవలేక మత్తుగా నీవు ఒత్తిగిలిన నిమిషంలో, నీడలా నీతో నేనే వున్నాను. నీకు ఏకాంతమే లేదు. నీ ప్రతికదలికా ప్రతిక్షణమూ నా కన్నులలో మెదులుతోంది.

మన ఊరు నీకు జ్ఞాపకంలేదుగదా! ఆ ఊరు వదలి నీవు చాలా కాలమైంది. అప్పుడు నీకు పసితనం-వెళ్ళిన తరువాత నీవు మళ్ళా ఎన్నడూ తిరిగిరాలేదు. పుట్టినఊరని పేరు మాత్రం తెలుసునా? ఏమో! ఇక్కడే చలనంలేకుండా వున్నాను నేను. అందుకే నాలో మార్పు లేదు. అన్నీ మొన్నమొన్న జరిగినట్లే ఉన్నాయి. ప్రస్ఫుటంగా!

పెద్దతోటలో చిన్న పెంకుటిల్లు మాది. వెనకవేపు మా పాలేరు కాపురం! ఇంట్లో అమ్మా, నేను, బంధువులు! ఇప్పుడు ఎవరూలేరు. వెనక పాకలో పాలేరు ఒక్కడే. ఇంట్లో రాజీ, నేనూ మిగిలాం! రాజీ మా బంధువులపిల్ల. మాదగ్గర పెరిగింది. మాటలురావు. మూగది, అది నాకు తోడు.

వీధిచివరన చిన్న పాక. ముందర బంతిపూలచెట్లు. అది మీ ఇల్లు. ఆ పాక మాదే. మీరు అద్దె ఇచ్చేవారు. మీనాన్న కొత్తగా పెళ్ళిచేసుకున్నాడు. భార్యతో ఆ పాకలో కాపురమున్నాడు. ఆయన వీణ చక్కగా వాయించేవాడు. పిల్లలకు సంగీతం నేర్పేవాడు. మీ అమ్మ శ్యామల

కూడా నేర్చుకునేది. ఎప్పుడూ వీణ వాయించేది. ఆ పాట మా ఇంటికి వినిపించేది. నిన్ను ప్రసవించి శ్యామల మృత్యువును కౌగలించుకుంది. మీనాన్న ఎన్నాళ్లో మతిలేని మనిషిలా తిరిగాడు, మళ్ళా నీకోసం కోలుకున్నాడు. మనంఆడుకునేటప్పుడు ఈ కథలు మావాళ్లు చెప్పేవారు.

నీ కంఠంలో మాధుర్యం విని నేను పరవశించేదాన్ని. అంత మధురంగా పాడుతున్నానని నీకు తెలియదు. అప్పుడు-నీమనస్సు ఆటలమీద ఉండేది. మన వీధికి అవతలి వేపున కాలువగట్టు. నీరు ఎప్పుడూ నిండివుండేది. అక్కడ చెట్లనీడల్లో నీవు ఆడుతూ వుండేవాడివి. నీకోసం ఎదురు చూస్తూ నేను గుమ్మంలో కూర్చునేదాన్ని. మసక చీకటివేళ మన్నునింపుకుని నీవు రాగానే, నేను నీదగ్గరకు పరుగెత్తుకు వచ్చేదాన్ని. ఆప్యాయంగా నీ జుట్టుమీద చేయివేసి మన్ను దులిపేదాన్ని. నీవు చిరాకుతో తల విదుల్చుకునేవాడివి. ఆ దృశ్యం మనసులో నిలిచిపోయింది. నీ నిర్లక్ష్యానికి ప్రతీకగా!

మీ నాన్న నీకు పాటనేర్పేవాడు. నేను పాటవింటూ కూర్చునేదాన్ని, చాలా సేపు. ఎప్పుడో నీకు ఎవరూ తోడు లేనప్పుడు మనం ఇసుకతిన్నెల్లో ఆడుకునేవాళ్లం. ఎప్పుడో ఒక్క క్షణం! ఆ ఆనందం ఇంకా మనసులో మెదులుతోంది.

ఒకరోజు మీనాన్న నిన్నుతీసుకుని ఊరువదలి నగరం వెళ్ళిపోయాడు. నీకు పాటనేర్పించాలనీ, నీవు గొప్పగాయకుడుగా పేరు పొందాలనీ ఆశతో! మీరు-వెళ్ళినరోజు మా

వీధి, మాఊరు పాడుపడినట్లనిపించాయి. మనం కలిసి ఆడు కున్న ఇసుకతిన్నెల్లో నేను ఒంటరిగా కూర్చునేదాన్ని. నీకోసం దిగులుపడుతూ! చాలారోజులు కాలవగట్టునుంచి అలసిపోయి నీవు తిరిగివస్తావనే అనుకున్నాను భ్రమతో. క్రమంగా ఇక నీవు రావని తెలిసింది. నా దిగులు నాలో ఒక భాగమై. నా ప్రకృతికి సహజమై లోలోపల దాగింది.

క్రమంగా నిన్నుగురించి చాలా వార్తలు వచ్చాయి. నీవు ఊరూర గానసభలు జరుపుతున్నావనీ, ప్రతినోట నీ పాట పలుకుతోందనీ, ఊరు వదలివెళ్ళి నీవొక ఉన్నత స్థానాన్ని ఆక్రమించుకున్నావు. కీర్తి సంపాదించుకున్నావు, సంగీతంలో కొత్తరుచి చూపించావు. నగరంలో నీ శిష్యు లతో సంగీతకళాశాల స్థాపించావు. నీ కింక కోరుకోదగింది ఏమీలేదు. పెద్దయినా నామనస్సు మనం కలిసి ఆడుకున్న ఇసుకతిన్నెలను దాటిపోలేదు. అక్కడ పరిచయమైన వ్యక్తి కోసమే కలలుకంటూ పసిపాపలా పరితపించింది.

మన ఊరికి, నగరానికి మధ్య కొండ అడ్డం ఎన్నో సార్లు ఆ కొండరాళ్ళను చూస్తూ అనుకున్నాను. ఇది దాటి పోగలిగితే దాదాను చూస్తాను అని! దాటటానికి ఎంతసేపు పడుతుంది? ఒక్కరోజు చాలునేమో! అయినా ఒంటరిగా పోలేను. రోజురోజు ఆశతో, నిరాశతో అటువేపే చూస్తూ కాలం గడిపాను.

ఒకసారి వచ్చాను, నీ సంగీత కళాశాలలో శిక్షణ పొందాలని మిష కల్పించుకుని. అప్పటికి అమ్మలేదు. బంధు

వులూ, చెదిరిపోయ్యారు రాజీకి ఏమీ తెలియదు. ఎన్నడూ ఊరు వదలని నేను నీకోసం వెతుకుతూ వచ్చాను.

నీ విద్యాభవనంలో చేరాను. నేను ఎవరో నీకు తెలియదు. ఎప్పుడు వచ్చి చేరానో తెలియదు. ఎందరో వస్తారు, ఎందరో పోతారు, అందరిలో నేనొకతెను.

నేను చేరిన తరువాత ఒక నెలవరకు అసలు నిన్ను చూడనేలేదు. నీ విద్యార్థులే పాట నేర్పుతున్నారు. కళాశాల నడుపుతున్నారు. ఎన్నిసార్లు ఎవరినడిగినా ఒక్కటే సమాధానం చెప్పారు.

“గురువుగారు ఎప్పుడో వస్తారు. ఎవరూ ఆయన దగ్గరకు వెళ్ళకూడదు. ఆయన ఏకాంతానికి భంగం కలిగించకూడదు.”

అక్కడవున్న ఒక్క నెలలో నిన్నుగురించి చాలా విన్నాను. చెట్లనీడల్లో విద్యార్థులే నెమ్మది నెమ్మదిగా గుసగుసలాడతారు. నీవు గొప్ప గాయకుడవైనా నీలో చపలత్వం ఉంది. నీపాటకు పరవసించి దీపపుకాంతికి ఆశపడిన శలభాలలాగా నీ దరిజేరిన ఆడపిల్లలను ఒక్కక్షణం కౌగలించి మరుక్షణం మరచిపోవటం నీస్వభావం! కవులకు, గాయకులకు రసికత ఎక్కువ! బహుశా అది శీలానికి లోపమేమో? ఎంత గొప్ప గాయకుడివో అంత జారుడిగాకూడా పేరు తెచ్చుకున్నావు. అది నేను మా ఊళ్ళోనూ విన్నాను. ఇక్కడికి వచ్చాక ఇంకా స్పష్టంగా తెలుసుకున్నాను, అయినా నాలో మమత చెదరలేదు.

విద్యాభవనానికి వెనకవేపున నీ మందిరం! ఎన్నో సార్లు అటువేపు వచ్చాను. ఒంటరిగా నిన్ను చూడాలన్న ఆశతో! నిన్ను చూడలేను. నీ పాట విన్నాను. చాలా సార్లు దూరాన్నుంచి, పరవశత్వంతో! నీ పాట విన్నకొద్దీ నీకు సన్నిహితంగా వుండాలన్న కోరిక నాలో తీవ్రమైంది

ఆవేళ పౌర్ణిమ. కళాశాలకు సెలవు. ఎవరూ లేరు. ఆ సాయంత్రం మళ్లా నీకోసం వచ్చాను. దూరాన నీ పాట వింటూ చాలాసేపు వున్నాను. తరువాత మైమరచి దగ్గరకు వచ్చాను. హఠాత్తుగా ముందర తోటలో నిన్ను చూశాను. ముందుకువాలిన నీ ముంగురులుచూచి నిన్ను గుర్తుపట్టాను. నేను సంతోషంతో పరవశించిన క్షణంలో నీవు నన్ను ఆప్యాయంగా కౌగలించుకున్నావు. నే నెవరో నీకు తెలియదు. అయినా ఆ వెన్నెలవేళ ఏ ఆడపిల్ల దగ్గరకువచ్చినా నీవు అంతేచేసివుందువు. ఆమె ఎవరో అంతకుముందు తెలియదు. రేపు ఆమె ఏమవుతుందో నీకు అక్కరలేదు. అది నీప్రకృతి. ఆ క్షణాన నాకూ నోట మాటరాలేదు. ఏ పిలుపూలేకుండా నీవు నన్ను పరిగ్రహించినట్లనిపించింది. ఆ ఆనందానుభూతిలో ఎన్నిక్షణాలు గడిచాయో, ఏ క్షణాన ఎలా నీ చేతులలోనుంచి జారి నేను దూరంగా తొలగిపొయ్యానో ఇప్పుడు నాకు స్పష్టంగా గుర్తులేదు

మర్నాడు నీవు విద్యాభవనానికి వచ్చావు. అపురూపంగా! ఆ వేళ కళాశాలకు సెలవు. పాడ్యమి! అక్కడ ఎవరూ లేరు! ఉన్న కొద్దిమంది విద్యార్థులు నీకు దూరంగా ఉన్నారు. నిశ్శబ్దంగా, నీమీద భక్తితో, ప్రేమతో, మధ్య ఆవరణ నుంచి నీపాట వినబడుతోంది. వేణునాదం విని ఆగలేని గోపికలా నేను అక్కడకు వచ్చాను, చప్పుడు కాకుండా! నీవు పరవశత్వంతో పాడుతున్నావు! నీ ప్రక్కన సునందాదేవి ఉంది. ఆమె గొప్ప గాయకురాలు, నీ మిత్రురాలు. ఆమెను గురించి నేను విన్నాను. ఆమె పరవశత్వంతో నిన్ను చూస్తోంది. నీవు ఆమెకోసమే గొంతెత్తి ఉల్లాసంగా పాడుతున్నావు నీ కళ్ళలో, నీ చిరునవ్వులో అనురాగం, ఆనందం తాండవిస్తున్నాయి, నేను ఆవరణలో అడుగుపెట్టింది మీరిద్దరూ గమనించలేదు. ఒక్కక్షణం అలానే ఉన్నాను, మిమ్మల్ని చూస్తూ! ఆ క్షణం తెలిసింది. ఈ నా ప్రయాణం వృథా అని. ఇప్పుడు నీవు నన్ను గుర్తుపట్టలేవు! నీ మనసులో నేను లేను. మర్నాడు నేను మా ఊరు వెళ్ళిపోయాను.

ఏ ఆడపిల్ల అయినా మీ విద్యాభవనంలో కొన్నాళ్లు ఉండివస్తే చెడ్డపేరుకూడా తెచ్చుకుంటుంది. నేనూ అదే తెచ్చుకున్నాను. నగరంనుంచి వచ్చాక నలుగురూ నన్ను చులకనగా చూచారు. ఆ బాధ మనస్సు ఓర్చుకోలేక పోయింది. ఈ అపవాదు తప్పించుకోటానికి అబద్ధం చెప్పాను. నీవు నన్ను రహస్యంగా వివాహమాడి బాధలపాలు చేశావనీ,

భరించలేక వచ్చేశాననీ చెప్పాను. అందరూ నమ్మారు. జాలిపడ్డారు. ఈ ప్రపంచం విచిత్రమైంది. నేను మానసికంగా నిన్ను వివాహం చేసుకున్నాననీ, నీవు గుర్తించకపోయినా నీకు దూరానఉన్నా, నేను నీదాననేననీ చెపితే, అందరూ అసహ్యించుకునేవారు, పరిహసించేవారు. అబద్ధమాడి పరిత్యక్తనై, అందరి సానుభూతి పొందుతున్నాను. నిజానికి నీవు నన్ను పరిగ్రహించినదీ లేదు. పరిత్యజించినదీ లేదు. ఇది నేను కల్పించుకున్న మిథ్య.

నగరానికివచ్చి నేను కొత్తవెతలు తెచ్చిపెట్టుకున్నాను. మునుపటి ప్రశాంతత లేదు. ఒక్కక్షణం నీకు సన్నిహితంగా సంతోషించిన హృదయం మళ్ళా నీకోసం వెయ్యింతలుగా పలవరించింది. అది భరించలేక నిన్ను వదలివచ్చినా నిలువలేక నీకు రాయటం ప్రారంభించాను. ఒక్కొక్కసారి ప్రాథేయపడుతూ, ఒకసారి నీవు జవాబు రాయలేదని బాధపడుతూ, ఒక్కొక్కసారి కోపగించుకుంటూ! ఇప్పుడు తెలుస్తూంది. అది నా మూర్ఖత్వం! నీవేమి చేయగలవు? నా మానసిక వ్యథకు నీవు కారణమూ కాదు. దానిని నీవు తొలగింపనూ లేవు.

“నా మనసు నా ప్రేమ నన్నలయ జేసిన మీవల్ల గుణ దోషమేమీ రామా. నావల్ల నేగాని” అన్న త్యాగరాజు హృదయావేదన గుర్తుకు వస్తోంది. ఈ భావాన్ని ఎన్నో రకాలుగా ఆయన వ్యక్తంచేశారు. “ఒకవేళ ప్రేమ మీర మదినెంచి మంచి పూల పూజింపుచు, ఒకవేళ కోప

గించి దూరుచుంటి, చనవున కొంత బలికెదను. ఈసున కొంత బలికెదను. నేరమెల్ల తనమీదనే చెప్పుకోవలెగాక. నిన్నాడ పనిలేదురా!'' అన్నాడు ఆ పాటలు నీ విద్యా భవనంలోనే విన్నాను _ అయినా ఆయన అనురాగం లీలామానషుని కోసం! నా అనురక్తి సర్వసాధారణ వ్యక్తికోసం! ఆయన ఆవేధన అనంతముక్తి పదం కోసం! ఎక్కడ పోలిక ! చిత్త చాంచల్యము ఒక్కటే !

స్వార్థరహితమైన అనురాగం లేదు. ప్రతివ్యక్తి తన్ను మాత్రమే తాను ప్రేమించుకొంటాడు: తల్లి కొడుకును ప్రేమించటంలేదు. పుత్రుని వలన పొందే సుఖాన్ని ప్రేమిస్తోంది. భార్య భర్తను ప్రేమించదు! భర్త వలన పొందే ఆనందానికి ఆశపడుతుంది. ఇతరులు ఇచ్చే సుఖాన్ని ప్రేమిస్తున్నాం. వారిని ప్రేమించడంలేదు. ఈ మాటలు ఎవరో చెప్పగా విన్నాను. యాజ్ఞవల్క్యుడు మైత్రేయితో అన్నాడట. అదే నిజమేమో! నేను నిన్ను ప్రేమించడంలేదు నీ పాటలు వినేటప్పుడు ఆప్యాయంగా నీ ముంగురులు సరిదిద్దినపుడు పొందిన ఆనందాన్ని మాత్రమే ప్రేమిస్తున్నాను. దాని కోసమే పరితపిస్తున్నాను, ఆ సుఖం లేదని దుఃఖ పడుతున్నాను. కోపగించుకుంటున్నాను. అంతే కాబోలు!

అయినా ఎన్నేళ్ళు గడచినా మమకారం నశించదు. ఎందుకో! ఎన్నాళ్ళు పరితపించినా నీవు బదులు పలుకలేదు. నిస్పృహతో నేను రాయడమూ మానుకున్నాను. మనసులో

నీ నీడ వదలలేదు. దానితోనే బ్రతకటం నేర్చుకున్నాను. రోజులు గడిచాయి. ఋతువులు మారాయి. సంవత్సరాలు దాటిపోయాయి నీవు రాలేదు. నేను రావడానికి ప్రయత్నించలేదు. నీకూ నాకూ మధ్య ఈ కొండ ఇలా నేవుంది. అది దాటిపోవాలన్న కోరిక ఇప్పుడు లేదు. ఆ కొండ అవతల నీవు ఉన్నావన్న స్పృహ ఉంది. అటే చూస్తూ ఉంటాను. నీ ప్రతి కదలిక కళ్లకు కట్టినట్లే ఉంటుంది.

కొన్నాళ్ళుగా నా కాలిమీద ఒక రణం ఏర్పడింది. అది నయంకాదన్నాడు. మా ఊరి వైద్యుడు. ఆరునెలల్లో మృత్యువు తప్పదన్నాడు. ఇది ఇప్పుడు ఊరటగావుంది ఈ ఆరు నెలల్లో ఈ నిరీక్షణ, ఈ వ్యథ అంతమౌతాయి.

ఈ ఇల్లూ, ఈ తోట, పొలము అన్నీ నీకే వ్రాసిపోతాను. నీవు వచ్చేవరకు పాలేరు, రాజీ ఇక్కడే ఉంటారు. నీ ఆస్తి కాపాడుతూ! నీవు ఎన్నడూ ఎరుగని భార్య ఇక్కడ నీ కోసం విలపించి విలపించి మరణించిందని ఎప్పుడైనా నీకు తెలిస్తే, వచ్చి నీ ఆస్తి నీవు తీసుకువెళ్లు. ఈ ఇల్లు కనిపెట్టుకున్న పాలేరును రాజీని ఆదరించు వాళ్లు నాకు ప్రాణం. నా సమాధిమీద ఆప్యాయంగా చేయివేయకు నీకోసం పరితపించిన ప్రాణి అక్కడలేదు.

నేను వెళ్ళిపోయిన తరువాత ఈ ఇంటిని, ఈ తోటను కమ్ముకునే శూన్యాన్ని తలుచుకుంటె ఏదో గుండె దిగు

లుగా ఉంది. అయినా ఇది ఒట్టి భ్రమ. **I am not the first I am not the last. This is neither the begining nor the end.** "అవ్యక్తాదీని భూతాని, వ్యక్తమధ్యావిభారత, అవ్యక్త నిధనాన్యేవ తత్రకా పరిదేవనా!" ఎప్పుడో చదువుకున్న వాక్యాలు స్ఫురణకు వస్తున్నాయి. అనంతమైన విశ్వంలో అణుమాత్రమైనా కాని బ్రతుకు, పెనుతుపానులో అతివేగంతో చెదిరిపోతున్న శిథిలపత్రం, దీని గమ్యాన్ని గురించి ఆలోచన, అంతాన్ని గురించి ఆవేదన ఎందుకు?

అన్ని ఉత్తరాలలాగే ఇదీ నీకు అందదు, అందుకే అరమరిక లేక రాస్తున్నాను. నా ప్రాణవాయువులాగే ఈ లేఖ గాలిలో కలిసిపోతుంది. ఎప్పుడో! అంతేకదా! దాదా!